**ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం**

**విశాఖపట్నం కేంద్రం**

**జాతీయ వార్తలు**

తేదీ: 06-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

**ముఖ్యాంశాలు**

- ప్రకృతి వ్యవసాయాన్ని బలోపేతం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.

- ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో స్వావలంబన మాత్రమే సరైన మార్గమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

- పారిశ్రామిక సంస్థల భద్రతలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (CISF) కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు.

- ఉన్నత విద్యా వ్యవస్థను ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = =

భారత ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముకగా నిలుస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా “వ్యవసాయం-గ్రామీణ పరివర్తన” అనే అంశంపై బడ్జెట్ అనంతర వెబినార్‌ను ఉద్దేశించి ఈరోజు ఆయన ప్రసంగించారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని తెలిపారు. ఈ సంవత్సరం కేంద్ర బడ్జెట్ వ్యవసాయం, గ్రామీణ పరివర్తనకు ప్రోత్సాహాన్ని అందిస్తోందన్నారు. భారతదేశం ప్రస్తుతం ఆహార ధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలను రికార్డు స్థాయిలో ఉత్పత్తి చేస్తోందని పేర్కొన్నారు. రసాయనాలు లేకుండా సహజ, ప్రకృతి వ్యవసాయాన్ని బలోపేతం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద దాదాపు 10 కోట్ల మంది రైతులు 4 లక్షల కోట్ల రూపాయలకు పైగా మొత్తాన్ని అందుకున్నారని, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ఇప్పటివరకు దాదాపు 2 లక్షల కోట్ల రూపాయల విలువైన క్లెయిమ్‌లను పరిష్కరించామని ప్రధానమంత్రి వివరిస్తూ...

(వాయిస్…31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా ఉన్న కీలకమైన పారిశ్రామిక సంస్థల వద్ద భద్రతను నిర్ధారించడంలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (CISF) ముఖ్య పాత్ర పోషిస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. కటక్‌లోని ముండలిలో ఈరోజు జరిగిన CISF 57వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ.. CISF లేకుండా భారతదేశ పారిశ్రామిక అభివృద్ధి అసాధ్యమన్నారు. కీలకమైన సముద్ర సౌకర్యాల వద్ద భద్రతను మరింత బలోపేతం చేయడానికి త్వరలో ఓడరేవు భద్రతను CISFకు అప్పగించనున్నట్టు తెలిపారు. మావోయిజం అంశాన్ని ప్రస్తావిస్తూ, ఈ సంవత్సరం మార్చి నెలకు భారతదేశం నక్సలిజం నుండి విముక్తి పొందుతుందని, ఈ మిషన్‌కు CISF గణనీయంగా కృషి చేసిందని హోంమంత్రి పేర్కొంటూ...

(వాయిస్…26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

భారతదేశ ఉన్నత విద్యా వ్యవస్థను ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా మార్చాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పియూష్ గోయల్ పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన వైస్ ఛాన్సలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాలు పాఠ్యాంశాలను ఆధునీకరించాలని, కృత్రిమ మేధ, క్వాంటం కంప్యూటింగ్, మెషిన్ లెర్నింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలను స్వీకరించాలని కోరారు. జాతీయ విద్యా విధానం-2020పై మాట్లాడుతూ.. దేశ విదేశాల నుండి సుమారు 3 లక్షల సూచనలను పరిగణనలోకి తీసుకొని విధానాన్ని రూపొందించామన్నారు. అభివృద్ధి చెందిన దేశాల విద్యార్థులు భారత్‌లో చదువుకోవడాన్ని ప్రోత్సహించాల్సి ఉందని, అలాగే విద్య కోసం విదేశాలకు వెళ్లే భారతీయ విద్యార్థుల ధోరణిని మార్చడమే లక్ష్యమని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్న ప్రస్తుత తరుణంలో స్వావలంబన మాత్రమే సరైన మార్గమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. కోల్‌కతాలో సాగర్ సంకల్ప్ - భారతదేశ సముద్ర వైభవాన్ని తిరిగి పొందడం అనే రక్షణ, సముద్ర సంభాషణను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రపంచ పరిస్థితి సరఫరా చైన్ల పునర్వ్యవస్థీకరణకు, కొత్త సమీకరణాల ఏర్పాటుకు, సముద్ర కార్యకలాపాలలో స్థిరమైన పెరుగుదలకు దారితీసిందన్నారు. ప్రతి రంగంలోనూ స్వావలంబన సాధించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని రక్షణ మంత్రి పునరుద్ఘాటిస్తూ…

(వాయిస్…19 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ఖతార్‌లోని భారతీయులందరూ ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా అక్కడి అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని దోహాలోని భారత రాయబార కార్యాలయం కోరింది. ఖతార్ నివాసితులందరూ సురక్షితమైన ప్రదేశాలలో ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు వెళ్లకూడదని సూచించింది. ఖతార్ వైమానిక ప్రాంతం మూసివేయబడిందని, విమాన కార్యకలాపాలు తాత్కాలికంగా నిలిపివేయబడ్డాయని తెలిపింది. ప్రయాణీకులందరూ సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించాలని కోరింది.

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వం జనపనార నుంచి వస్త్రాలను ఉత్పత్తి చేయడానికి చర్యలు తీసుకుంటోందని కేంద్ర జౌళి శాఖా మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. కోల్‌కతాలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. జనపనార నుండి వస్త్రాలను తయారు చేయడానికి పశ్చిమ బెంగాల్‌ను కేంద్రంగా ఎంపిక చేశామని అన్నారు. జనపనార రైతులు, చేనేత కార్మికుల ఆదాయాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = =

ఖేలో ఇండియా ట్రైబల్ గేమ్స్ (KITG) ఈ నెల 26వ తేదీ నుండి వచ్చే నెల 6వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరగనున్నాయని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖా మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా తెలిపారు. గిరిజన క్రీడల ప్రారంభ సంచిక రాష్ట్రంలోని రాయ్‌పూర్, జగదల్‌పూర్, సర్గుజా నగరాల్లో జరుగుతుందని, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, హాకీ, వెయిట్ లిఫ్టింగ్, విలువిద్య, ఈత, రెజ్లింగ్ మొదలైన ఏడు అంశాల్లో క్రీడలు ఉంటాయని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో క్రీడా ప్రతిభను గుర్తించడంలోను, అలాగే.. వికసిత్ భారత్ దార్శనికతను సాధించడంలోను క్రీడలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = =

దక్షిణాది ప్రపంచానికి స్థిరమైన మారీటైమ్ అభివృద్ధి అత్యంత ఆవశ్యకమని విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఉద్ఘాటించారు. న్యూఢిల్లీలో జరిగిన రైసినా డైలాగ్ 2026 రెండవ రోజు కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ.. భారతదేశ నిర్ణయాలు జాతీయ ప్రయోజనాల ఆధారంగా దిశానిర్దేశం చేయబడతాయని స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో స్థిరత్వాన్ని ప్రోత్సహించే ఉద్దేశ్యంతో భారత్ - మిడిల్ ఈస్ట్ - యూరప్ ఎకనామిక్ కారిడార్ వంటి కార్యక్రమాలను ముందుకు తీసుకువెళుతోందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర విద్యుత్ శాఖా మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్.. ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వాహణలో పెరుగుతున్న సవాళ్ళపై కేంద్ర బొగ్గు, గనుల శాఖా మంత్రి జి. కిషన్ రెడ్డితో ఈరోజు చర్చలు జరిపారు. ఈ-వ్యర్థాల రీసైక్లింగ్ సరఫరా చైన్‌ను సమీక్షించడానికి నిర్వహించిన ఈ సమావేశంలో పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. వ్యర్థాల సేకరణ నెట్‌వర్క్‌లను బలోపేతం చేయడం, రీసైక్లింగ్ సామర్థ్యాన్ని మెరుగుపరచడం, ఈ-వ్యర్థాలకు సంబంధించిన ఆర్థిక వ్యవస్థను నిర్మించడంపై కూడా చర్చలు జరిగాయని మనోహర్‌లాల్ ఖట్టర్ ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = =

నాగాలాండ్ యువత జాతీయ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని జాతి నిర్మాణానికి తోడ్పడాలని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్  పిలుపునిచ్చారు. జున్హెబోటో జిల్లా లుమామిలో ఈరోజు జరిగిన నాగాలాండ్ విశ్వవిద్యాలయం 8వ స్నాతకోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు వికసిత్ నాగాలాండ్ ముఖ్యమైనదన్నారు. గత దశాబ్ద కాలంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో ఈశాన్య ప్రాంతంలో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు శాంతి కార్యక్రమాలు జరిగాయని, సమగ్ర అభివృద్ధికి శాంతి, సహకారం కీలకమని ఉప రాష్ట్రపతి వ్యాఖ్యానించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = =